జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 25-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 109 పేజీలు: 8 వెల : రూ.7




## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇలాఖాలో..

# ఎరువుల కొరత

*** కృత్రిమ కొరతతో దోపిడీకి తెరలేపిన స్థానిక వ్యాపారులు * అధిక ధరకు యూరియా, డీఏపీ విక్రయాలు * సొసైటీలకు ఇంకా చేరని ఎరువులు * చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారులు * వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న దృష్టి తీసుకువెళ్లేందుకు రైతులు సన్నద్ధం**

**టెక్కలి, ఆగస్టు 24 (వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గమైన టెక్కలిలో ఎరువులు కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలో ఉన్న నేపథ్యంలో ఎరువులు కొరత లేకుండా చూడవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతు భరోసా కేంద్రాలకు ఏప్రిల్ నెలలో ఎరువులు చేరాయి. అయితే ఇవి కూడా పూర్తిస్థాయిలో చేరలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా జూన్, జులై నెలలో రైతులకు పంపిణీ చేశారు. అయితే ప్రస్తుతం ఎరువులు రైతులు అవసరం మేరకు లేకపోవడం వల్ల ప్రైవేట్ వ్యాపారుల పైన ఆధారపడవలసిన పరిస్థితి వచ్చింది. దీంతో గత మూడు రోజులుగా టెక్కలి పట్టణంలో ఎరువుల డీలర్లు కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించి అధిక రేట్లకు అమ్ముతున్నారని బహిరంగ విమర్శ వినపడుతున్నాయి. యూరియాపై 50 నుంచి 100 రూపాయలు, డిఏపిపై 100 నుండి 200 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. రైతులు ఎరువులు అడిగితే ఇతర పురుగుల మందులు, కలుపు మందులు కొనుగోలు చేయాలని వ్యాపారులు చెబుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇటు రైతు భరోసా కేంద్రాలకు గాని అటు సొసైటీలకు గాని ఎరువులు చేరలేదు. దీన్ని అదునుగా చేసుకుని వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు సొంత నియోజకవర్గంలో ప్రైవేటు డీలర్ దగ్గర ఉన్న స్టాకు రేట్లను నిత్యం పర్యవేక్షించవలసిన వ్యవసాయ శాఖ అధికారులు కనీసం స్పందించడం లేదని ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి స్పందించి కృత్రిమ ఎరువుల కొరతను నివారించి అధిక ధరలపై అమ్ముతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.




## దశల వారీగా..

*** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**
*** సంతబొమ్మాళిలో సుడిగాలి పర్యటన**

# సమస్యలు పరిష్కరిస్తాం

**సంతబొమ్మాళి, ఆగస్టు24 (వార్త):** మండల కేంద్రం సంతబొమ్మాళిలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పనకు దశలవారీగా కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం సంతబొమ్మాళి గ్రామంలోని కొండవీధి, గొల్లవీధి, కంద్రవీధి, మాదిక వీధి, మెయిన్ రోడ్డు తదితర వీధులను మంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు రహదారులు, తాగునీరు, మురుగు నీరు సమస్యలను మంత్రి వద్ద మొరపెట్టుకున్నారు. ముఖ్యంగా కొండవీధిలో పేరుకు పోయిన మురికి నీటి విషయమై స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా పంచాయతీ రాజ్ అధికారులను పిలిచి మెరుగైన డ్రైనేజి ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే మాదిక వీధిలో స్మశానానికి రహదారి, పెండింగ్ లో ఉన్న ఇళ్ల స్థల పట్టాలకు స్థలాలను చూపించాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు సూచించారు. దమ్మలవీది, వెలమవీధి, మాదిక వీధికి తాగు నీటి సమస్యపై సత్వరమే చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మంత్రి ఆదేశించారు. అంతకు ముందు స్థానిక సచివాలయం నిర్మాణ పనులు, తదితర అసంపూర్తి భవనాలను మంత్రి పరిశీలించి వాటి వివరాలు అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఇవి త్వరిత గతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఈ ప్రభుత్వ భవనాలు సముదాయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలో పార్క్‌ను పరిశీలించి ఇక్కడ ఏయే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని స్థానిక నాయకులకు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు కుచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, అల్లు రమేష్ కుమార్, తంగిరమణమూర్తి,పప్పు కృష్ణారావు, ముద్దపు లచ్చన్న, రెడ్డి అప్పన్న, ఎంపీడీఓ ప్రేమలీల, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఫరీదుపేటలో ఉద్రిక్తత

*** దాడిలో గాయపడిన యువకుడు మృతి**
*** వైసీపీ నేతల ఆందోళన * గ్రామంలో పోలీస్ పికెట్**

**ఎచ్చెర్ల, ఆగస్టు 24 (వార్త):** ఫరీద్‌పేట గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా జిల్లా పోలీసు బాస్ ఆదేశాల మేరకు అక్కడ పోలీస్‌పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట గ్రామంలో ఈ నెల 18న రాత్రి కూన ప్రసాద్(25)పై పలువురు దాడి చేశారు. ప్రసాద్ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ప్రసాద్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువ స్తున్నారన్న విషయం తెలుసుకుని వైసీపీ నేతలు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపీపీ చిరంజీవి, వైసీపీ నేతలు సనపల నారాయణరావుతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు కొయ్యరాళ్ల జంక్షన్ వద్ద ఆందోళనకు దిగారు. దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు వారికి నచ్చజెప్పడంతో శాంతించారు. ఫరీద్‌పేట గ్రామంలో భారీగా పోలీసు పహారా కొనసాగుతోంది. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోకుండా శనివారం ఉదయం నుంచే పోలీసు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీలు శ్రీనివాసరావు, శేషాద్రి, సీఐలు అవతారం, ప్రసాద్, పైడపునాయుడు, ఇమ్మాన్యుయల్ రాజుతో పాటు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది గ్రామంలో అల్లర్లు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు.

## దున్నవూరులో ఎలుగు హల్‌చల్

**మందస, ఆగస్టు 24 (వార్త):** ఉద్దానం ప్రాంతానికి ఎలుగుబంట్ల భయం వెంటాడుతునే ఉంది. మందస మండలంలోని దున్నవూరు ప్రాంతంలో ఎలుగుబంటి శనివారం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. పనుల నిమిత్తం జీడితోటలకు వెళ్లిన వారికి ఎలుగుబంటి కనిపించండంతో కేకలు వేశారు. దీంతో ఎలుగుబంటి పరుగులు తీసింది. అయితే ఎవరిపై దాడి చేయకపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. గ్రామస్థులు కేకలు వేస్తున్నా ఎలుగుబంటి మాత్రం నిదానంగా రోడ్డు దాటి జీడి తోటల్లోకి వెళ్లిపోయింది.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 29న దోకులపాడులో జిల్లా స్థాయి కవి సమ్మేళనం, పాటల పోటీలు

సోంపేట, ఆగస్టు 24(వార్త): ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక వార్షికోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న వజ్రపుకొత్తూరు మండలం దోకులపాడులో జిల్లా స్థాయి కవి సమ్మేళనం, పాటల పోటీ నిర్వహిస్తున్నట్టు వేదిక అధ్యక్షుడు ఎల్.రుద్రమూర్తి తెలిపారు. ఈ సమ్మేళనంలో పాల్గొనే ప్రతి కవికి జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేయడంతో పాటు సన్మానిస్తామని పేర్కొన్నారు. పాటల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందినవారికి రూ.700, రూ.500, రూ.300 బహుమతితో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేసి, సన్మానిస్తామన్నారు. పాల్గొనే ప్రతి గాయకునికి కూడా జ్ఞాపిక, సర్టిఫికెట్ బహుకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ఆ రోజు ఉదయం 10.00 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు తన పేరు, చిరునామా, ఫొటో, కవి తన కవితను, గాయకుడు తాను పాడే పాటను ఈనెల 25లోగా సెల్ నెంబరు 9827408575కు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు.

# సమన్వయంతో పనిచేయండి

- అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే గొండు శంకర్ సూచన
- సాఫీగా గార మండల సర్వసభ్యసమావేశం



గార, ఆగస్టు 24(వార్త): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. గార మండల కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురాం అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు అధికారులు, వైద్యులు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, పీహెచ్‌సీల్లో మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. శివారు ప్రాంతాలకు కూడా సాగునీరందించి రైతులను ఆదుకుంటామని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతి పాదనలు సిద్ధం చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో నాణ్యమైన 24 గంటల విద్యుత్ నిరంతరంగా అందజేయాలన్నారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు చేపట్టాల న్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు వివిధ శాఖల అధికారులు సమాధానమిచ్చారు. పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కావాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీడీవో, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాలకొండ నూతన ఎస్ఐగా ప్రయోగమూర్తి



పాలకొండ, ఆగస్టు 24(వార్త): పాలకొండ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రయోగమూర్తి శనివారం విధుల్లో చేరారు. పార్వతీపురం స్పెషల్ బ్రాంచ్‌లో ఆయన పని చేస్తూ..ఇక్కడకు బదిలీపై వచ్చారు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ప్రశాంత్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# నేనున్నానని..!

- ఓ పేద అమ్మాయి పెళ్లికి సాయం చేసిన ఎమ్మెల్యే మామిడి
- రూ.20వేల అందజేత



పాతపట్నం, ఆగస్టు 24(వార్త): పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. పాతపట్నం మండలంలోని తామర గ్రామానికి చెందిన పడ్డాన ఫల్గుణరావు, రమ దంపతుల కుమార్తె ధనలక్ష్మి వివాహానికి రూ.20వేలను పసుపు కుంకుమ కింద ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. ఈ గ్రామాన్ని పదిహేనుళ్లుగా దత్తత తీసుకుని, అక్కడ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తన సొంత డబ్బులతో ఎంజీఆర్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కార్యక్రమంలో తామర సర్పంచ్ ఇప్పిలి ధనుంజయ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోయిలాపు సంజీవరావు, వావిలపల్లి వెంకటరమణ, ఎచ్చెర్ల చిన్నబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



గోపీ, గోపికల వేషధారణలో రవీంద్రభారతి విద్యార్థులు

పాతపట్నం, ఆగస్టు 24(వార్త): పాతపట్నం రవీంద్రభారతి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉట్టిని కట్టి చిన్నారుల చేత కొట్టించే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల డీన్ వి.నాగరాజు మాట్లాడుతూ శ్రీకృష్ణుని జనన వృత్తాంతం, ఆయన లీలలు తెలియజేస్తూ, చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**రేపు మందసలో..**

**మందస:** కృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 26న మందస బజారు వీధిలో గల శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ధర్మాదాయ, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు అర్చకుడు నిర్మలపాణిగ్రాహి తెలిపారు.

ఈవో వాసుదేవరావు ఆధ్వ ర్యంలో ఉదయం 9గంటలకు పూజలు, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని తీర్థ, ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

# ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు ప్రోత్సాహకం



మందస, ఆగస్టు 24(వార్త): సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ఐటీకి ఎంపికైన విద్యార్థినులు యానాది రోజా, బొందల కావ్యకు దాతలు ప్రోత్సహకం అందజేశారు. ప్రతిభచూపిన వీరిద్దరికి రౌతు పోలమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో ఔగాన ఈశ్వరరావు ఒక్కొక్కరికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ.. ఉన్నత చదువులకు ఎంపిక కావడం విశేషమన్నారు. పేద కుటుంబాల విద్యార్థులే ప్రభుత్వ బడుల్లో చేరుతారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈశ్వరరావు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుందర్‌సాల్మన్, ఉపాధ్యాయులు తులసీదాసు, కరుణాకర్, రౌతు పోలమ్మసేవాసమితి ఫౌండర్స్ చింతాడ లక్ష్మీనారాయణ,సర్పంచ్ చిచ్చుల నళిని, శ్రీనివాసరావు, ఎ.నారాయణ రావు, యానాది వాసుదేవు, మద్ది సత్యం, ఎం.సురేష్, టి.మహేశ్, బి.వల్లభరావు, సురేష్, టి.కాళి పాల్గొన్నారు.



## విద్యా సామగ్రి వితరణ

సోంపేట, ఆగస్టు 24(వార్త): రామయ్యపట్నంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లు శనివారం పంపిణీ చేశారు. సోంపేట పట్టణ వైశ్య సంఘం ప్రెసిడెంట్ సానా షణ్ముఖరావు తన మనవడి పుట్టినరోజు సందర్భంగా వీటిని వితరణగా అందించారు. ఈ సందర్భంగా మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిట్ట గోపాల్ మాట్లాడుతూ పాఠశాల విద్య బలోపేతానికి దాతలు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని భావిభారత పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థులకు విందు ఏర్పాటుచేశారు. సానాను పాఠశాల హెచ్ఎం డాక్టర్ నగిరి మోహనరావు, గ్రామస్తులు అభినందించారు.

## 175 మందికి వైద్య పరీక్షలు



సోంపేట, ఆగస్టు 24(వార్త):కొర్లాం పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో ఇటీవల వైరల్ జ్వరాలు ప్రబలడంతో జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 175 మందికి వైద్య పరీక్షలు జరిపారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి మాట్లాడుతూ పేద వర్గాలను ఆదుకోవడం సిబ్బంది మానవత్వానికి నిదర్శమని కొనియాడారు. వ్యాధి తీవ్రత ఉన్న వారికి శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైద్యులు బి.శ్వేత, మేనేజర్ చిన్నారావు, ఉప సర్పంచ్ తామాడ వాసుదేవరావు, మోహనరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భాస్కరరావుకు ఘన సన్మానం



మందస, ఆగస్టు 24(వార్త): సొండిపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మల్లారెడ్డి భాస్కరరావును ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. మందస మండలంతో పాటు పలు ప్రాంతాల్లో దివ్యాంగులను ఆయన గుర్తించి, వారికి కృత్రిమ అవయవాల్ని అందించడంతో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఇతోధిక సాయాన్ని, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కొత్తవలసకు చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల సమస్యల్ని లలితకుమారికి తెలిపానన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరానని తెలిపారు.

## బ్యాంక్ క్లర్క్ పరీక్షలు ప్రారంభం

నరసన్నపేట, ఆగస్టు 24(వార్త): వివిధ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టులు భర్తీకి ఐబీపీఎస్ నిర్వహించే పరీక్షలు శనివారం నరసన్నపేట కోర్ టెక్నాలజీ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి అభ్యర్థులు సుదూర ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. మూడు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మందస ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఖాదర్‌బాషా



మందస, ఆగస్టు 24(వార్త): మందస పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.కె.ఖాదర్‌బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డీపీటీసీ కేంద్రం నుంచి మందస ఎస్ఐగా నియమితులయ్యారు. మందసలో ఎస్ఐగా పని చేసిన అనిల్ కుమార్ సారవకోట ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బాషాను స్టేషన్ సిబ్బంది అభినందించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఆవేశాకావేశాలకు లోనవ్వద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎటువంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.




## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


నరసన్నపేట, ఆగస్టు 24(వార్త): విద్యా, కుటుంబ సమస్యలతో మానసిక ఒత్తిడికి విద్యార్థులు లోనవుతుండడంతో మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని నరసన్నపేట డిగ్రీ కళాశాల డాక్టర్ పి.లత తెలిపారు. శనివారం ఆ కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాలతో తలెత్తే పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. పలువురు వ్యక్తులు విద్యార్థులను కలిసి మాదకద్రవ్యాల వినియోగంపై ఒత్తిడి తీసుకుని వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకలకు సీఐకి ఆహ్వానం



నరసన్నపేట, ఆగస్టు 24(వార్త): నరసన్నపేటలో ఈనెల 26నుంచి నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లుచేస్తున్నామని త్రైత సిద్ధాంత సేవా సభ్యులు తెలిపారు. శనివారం వారు పలువురు అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఈ వేడుకలకు హాజరుకావాలని నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాసరావుకు ఆహ్వానం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానికంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



నరసన్నపేట, ఆగస్టు 24(వార్త): విద్యార్థులు సరైన పౌష్టికాహారం తీసుకుంటే దృష్టి లోపాలు తొలగిపోతాయని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి డాక్టర్ బాలగంగాధర్ రాజు అన్నారు. ఆ కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో నంసన్నపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. 150 మంది విద్యార్థినులను పరీక్షించగా.. పది మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

## బూర్జ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ప్రవల్లిక



బూర్జ, ఆగస్టు 24(వార్త): బూర్జ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా శనివారం ఎం. ప్రవ ల్లిక బాధ్యతలు చేపట్టారు. ఆమెకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్ఐ ప్రవళిక మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం, వాహనాల తనిఖీలు, మహిళల భద్రత తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. క్రైమ్ రేట్ పెరగకుండా విధులు నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

## దుమ్ము రేపుతున్నారు..!

- నరసన్నపేట ప్రధాన రహదారిపై గ్రానైట్ యాష్
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు



(నరసన్నపేట)

నరసన్నపేట మెయిన్ రోడ్డుపై గ్రానైట్ యాష్ పడడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణ ప్రధాన రహదారిలో గ్రానైట్ వ్యర్థాలు తరలిస్తున్నారు. ఆ యాష్ రోడ్డు మీద పడి బూడిద మయమైంది. గాలి వీచినప్పుడు అది వాహన దారుల మీదకు రావడంతో అవస్థలు తప్పడం లేదని వారు వాపోతున్నారు. గ్రానైట్ యాష్ తరలించే వాహనాలు పట్టణ ప్రధాన రహదారిలో ప్రయాణించకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళా పోలీసుల మానవత్వం

**మహిళను కాపాడిన గార కానిస్టేబుల్, హెూం గార్డు**

**అభినందించిన ఎస్పీ**



గార, ఆగస్టు 24(వార్త): అర్ధరాత్రి వేళలో సకాలంలో స్పందించి బాధిత మహిళ ప్రాణాలను కాపాడి గార పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్, మహిళా హెూమ్‌గార్డు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గార పోలీసు స్టేషన్లో శుక్రవారం నైట్ డ్యూటీలో మహిళా కానిస్టేబుల్ ఉషారాణి, మహిళ హెూం గార్డు రాజ్యలక్ష్మి ఉన్నారు. ఆ రోజు అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో ఓ మహిళ పెళ్లిలో వంట పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో పోలీసుస్టేషన్ దగ్గరలో విషసర్పం(పాము) కాటు వేసింది. ఆ సమయంలో నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళ.. ఏమి చేయాలో తోచక భయభ్రాంతులకు గురై దగ్గరలో ఉన్న గార పోలీసుస్టేషన్‌కు చేరుకొని పోలీసుల సహాయాన్ని ఆశ్రయించింది. ఆ వెంటనే వారు ఆమె వద్దకు చేరుకుని మనోధైర్యాన్ని ఇచ్చారు. 108 కు ఫోన్ కాల్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో ఆ సిబ్బంది అక్కడకు చేరుకుని అంబులెన్స్ ఎక్కించి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి ఆమె ప్రాణాలు కాపాడారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, గార పోలీస్‌స్టేషన్ హౌస్‌ఆఫీసర్ కె.కృష్ణప్రసాద్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ విధంగానే సేవలందించాలని సూచించారు.

## ప్రశాంత్ కుటుంబానికి అండగా ఉంటాం

- జనసేన నాయకులు



పొందూరు, ఆగస్టు 24(వార్త): విశాఖపట్నం అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పొందూరు గ్రామానికి చెందిన హంస ప్రశాంత్ అనే జన సైనికుడు మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు, జనసేన నాయకులు హంస బాబీ తదితరులు మృతుడి కుటుంబసభ్యులను శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడన్నారు. చాలా మంచి వ్యక్తిని కోల్పోయామని వాపోయారు. ఇది తమకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వీరి వెంట జనసేన పార్టీ మండల అధ్యక్షుడు యలకల రమణ, జిల్లా కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, మండల నాయకులు బెల్లాన శివ, ముల్లు హరినాథ్, కొంచాడ సిమ్మి నాయుడు, జన సైనికులు తదితరులు ఉన్నారు.

## మురుగునీరు తొలగించరూ..!

- ప్రయాణికుల వినతి



(నరసన్నపేట)

నరసన్నపేట పట్టణ శివారులో గొట్టిపల్లి అండర్ పాస్ వద్ద మారుతీనగర్ నుంచి వచ్చే కాలువ మూసుకు పోవడంతో మురుగు నీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో మురుగు నీరు రోడ్డు మీద చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని, కాలువను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ

# వార్త

తెలుగు దిన పత్రిక






## ప్రధానోపాధ్యాయుడికి చార్జీమెమో

**పలాస, ఆగస్టు24(వార్త):** కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు చిన్నం నాయుడుకు విద్యాశాఖాధికారులు మెమో జారీ చేశారు. కాశీ బుగ్గ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆలీ ఖాన్, టెక్కలి ఇన్చార్జి డిప్యూటీ విద్యాశాఖాధికారిణి విజయ కుమారి, శ్రీకాకుళం బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు వాగ్దేవి సందర్శించారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై అదే తరగతి చదువుతున్న విద్యార్థి వేదింపులకు గురి చేస్తున్నట్లు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ బృందం పర్య టించి వివరాలు సేకరించారు. బాలిక, విద్యార్థిని పక్కపక్కనే పెట్టి విచారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక తండ్రి ఫిర్యాదు చేసిన పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు స్పందించలేదని విషయం మా పరిశీలనలో తేలిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకు స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చార్జీ మెమో జారీ చేశామని చెప్పారు. విద్యార్థులు తల్లిదండ్రులను పిలించి అందరి సమక్షంలో మరోసారి విచారణ జరిపిస్తామని చెప్పారు.



## కళలను కాపాడుకోవాలి

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 24 (వార్త):** కళలు అంతరించిపోకూడదని, సాంస్కృతిక రంగాలకు శ్రీకాకుళానికి ప్రత్యేక స్థానముందని పలువురు వక్తలు తెలిపారు. అంతరించిపోతున్న కళలు, చేతి వృత్తుల అంశంపై భారత జాతీయ కళలు, సంసృతి వారసత్వ సంస్థ న్యూ ఢిల్లీ (ఇంటాక్) శ్రీకాకుళం శాఖ కన్వేనర్ నూక సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ ఆవ రణలో గల స్కిల్ డెవలప్మెంట్ కారాలయంలో శని వారం సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో చాలా సంసృతి, సాంప్రదాయ కళలకు మంచి పేరు ఉంద న్నారు. జానపద గీతాలు, నాటక రంగ నృత్యాలు, గేయాలు, తప్పెడుగుళ్లు, శివబాగోతాలు, బుర్రకథలు, మై మై గుబ్బం, నెమలి నాట్యం ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయని, అవన్నీ ఇప్పుడు కను మరుగయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కొన్ని పండు గలలోను, పలు పాఠశాలలో ప్రదర్శనల ద్వారా ప్రజలకు చేరువయ్యేలా చూడాలని తెలిపారు. అదనపు కన్వీనర్ వి.జగన్నాథం మాట్లాడుతూ కళలను ప్రజా దరణలోకి తెస్తే కొంత వరకు ప్రయోజనముంటుం దన్నారు. కార్యక్రమంలో పి.జగన్ మోహన్‌రావు, రామలింగేశ్వరరావు, సూరంగి మోహనరావు, ఎం. ప్రసాదరావు, కె.రమణ మూర్తి, పొన్నాడ.రవి కుమార్, విష్ణుమూర్తి, మాధవి, బి.శంకర్ రావు, సీఈఓ సిక్కోలు చేనేత ఉత్పత్తి బి.అప్పల నాయుడు, ఉర్లం శివతేజ, రాజేశ్వరి పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 17వ బ్యాచ్ కు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు24 (వార్త):** ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 17వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ కు గాను లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగినటువంటి వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ్ కుమార్ తెలిపారు. సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే 17వ బ్యాచ్ లో 16 మందికే అవకాశం ఉంటుందన్నారు. ఫీజు ఇతర వివరాలకు 7382923293, 70950 40608, 7382924758 నంబర్లను సంప్రదించా లన్నారు.

## 27న ఆదిత్యుని హుండీ లెక్కింపు

**అరసవల్లి, ఆగస్టు24(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవ స్థానం హుండీలను ఈనెల 27న ఉదయం లెక్కించనున్నామని ఉప కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరుస్తామన్నారు.






## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు24(వార్త):** పర్యా వరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతీ ఒక్కరు పెద్దఎత్తున మొక్కలు నాటాలని డా.బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని సూచించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్- క్షేత్ర ప్రచార శాఖతో కలిసి డా.బీఆం "ఏయూ శనివారం 'ఏక్ పేడ్ మా కే నామ్( తల్లి పేరిట ఒక మొక్క నాటడం) కార్యక్రమాన్ని నిర్వహిం చారు. క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాల పరిస రాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటరీలను ఉద్దే శించి వీసీ మాట్లాడారు. కాలుష్యం అధికం అవుతుం డటం, దీని ప్రభావంతో అనారోగ్య సమాజం ఏర్పడు తుందన్నారు. పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో ఏక్ పేడ్ మాకే నామ్ లో భాగంగా మొక్కలు విరివిగా నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ శ్రీకాకుళంజిల్లా అధికారి బి.తారకప్రసాద్ మాట్లాడు తూ ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనల్లో భాగంగా దేశమంతా పెద్ద ఎత్తున తల్లిపేరిట మొక్క నాటడం కార్యక్రమంలో పాల్గొంటు న్నారని, దీనిలో ఆంధ్ర ప్రదేశ్ మరింత ముందుంజలో ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డా. బీఆర్ఏయూ రెక్టార్ ఆచార్య బి. అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య సి. సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎం.అనురాధ, జర్న లిజం విభాగం అధ్యాపకులు డా. ఆర్.తిరుపతిరావు, డా. జి.లీలా వరప్రసాదరావు, డా. వై.డి. రామదాస్, పీడీ డా.ఎం. శ్రీనువాసు, అధ్యాపకులు ఎం.రామారావు, టి.భవాని తదితరులు పాల్గొన్నారు.


## నకిలీలలపై అప్రమత్తంగా ఉండండి

* జీఎస్టీ ఆన్లైన్ చెల్లింపులపై అపోహలు వీడాలి
* వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ రాణి మోహన్

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 24 (వార్త):** నకిలీలలపై అప్రమత్తంగా ఉండాలని వాణిజ్య పన్నుల శాఖ సహాయ సంచాలకులు రాణి మోహన్ పిలుపు ఇచ్చారు. ఇటీవల జరిగిన పరిణామాల దృష్ట్యా ప్రజా చైతన్యం కోరి, సామాజిక ప్రయోజనం కోరి వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. "2017 నుంచి జీఎస్టీ చట్టం అమలులో ఉంది. అప్పటి నుంచి కూడా చట్టంలో కొన్ని సవరణలు వస్తూనే ఉన్నాయి. తదనుగుణంగా వ్యాపారులకు సంబంధిత సమాచారం చేరవేస్తూనే ఉన్నాము. అలానే జీఎస్టీ పై అవగాహ కల్పిస్తూనే ఉన్నాము. అయినా కూడా కొన్ని ఘటనలు ఇటీవల చోటు చేసుకుంటున్నాయి. వ్యాపారులలో కొందరి అవగాహన లోపం కారణంగానే ఇవి చోటు చేసుకుంటున్నాయి." "ఏం జరుగుతుందంటే నకిలీ వ్యక్తులు కొందరు మేం జీఎస్టీ అధికారులం అని చెబుతూ సంబంధిత సంస్థల్లోకి చొరబడుతున్నారు. మేం జీఎస్టీ అధికారులం అని చెప్పి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. ఎవ్వరైనా కనుక జీఎస్టీ అధికారులం అని చెప్పి, ఒక ప్రాంగణానికి కానీ వ్యాపార సముదాయానికి వెళ్తే వాళ్లు ఎవ్వరైనా సరే ముందు ప్రోపర్ ఐడీ చూపించమని అడగండి. ఇంకా మీకు అనుమానం నివృత్తి కాకపోతే సమీప జీఎస్టీ



కార్యాలయానికి సమాచారం అందించండి. సంబంధిత అధికారి (సహాయ కమిషనర్) తో మాట్లాడి సందేహ నివృత్తి చేసుకోవచ్చు. ఇక్కడ శ్రీకాకుళం జిల్లా పరిధిలో నాలుగు సర్కిళ్లు ఉన్నాయి. ఈ నాలుగు సర్కిళ్లకూ నలుగురు అసిస్టెంట్ కమిషనర్లు ఉన్నారు. వీరికి సంబంధించిన ఫోన్ నంబర్లు కూడా మీకు ఇస్తున్నాం. అలానే వారి మెయిల్ ఐడీలు కూడా మీకు ఇస్తున్నాం. వీటి సాయంతో మీరు డిజిటల్ కంప్లైంట్ కూడా చేయవచ్చు. జాగ్రత్త వహించండి.. చైతన్య వంతులు కండి. జీఎస్టీ చట్టం పై అవగాహన పెంచుకోండి. ఏ విధంగానూ ఎట్టి పరిస్థితుల్లోనూ మోసపోకండి.." అని రాణి మోహన్ తెలిపారు.



## వినాయక ఉత్సవానికి పందిరి రాట


**పలాస, ఆగస్టు 24(వార్త):** హిందువుల పండుగలో ప్రథమ పండుగ వినాయక చవితి కోసం చిన్న పెద్దా తేడా లేకుండా అందరూ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటారు. వినాయక చవితి ఉత్సవాలు జరిపేందుకు ముందుగా మండపం ఏర్పాటు చేసేందుకు పందిరి రాట వేయడం ఆనవాయితీగా వస్తున్న హిందూ సాంప్రదాయం. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ప్రతి ఏడాది నిర్వహించే విధంగా ఈ ఏడాది కూడా వినాయక ఉత్సవాలు జరిపేందుకు సిద్ధమైన కమిటీ శనివారం మండపం ఏర్పాట్లు భాగంగా సిద్ధి వినాయక పూజ కమిటీ ఆధ్వర్యంలో పందిరిరాట వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు దువ్వాడ శ్రీకాంత్ ముఖ్య అతిధిగా హాజరు కాగా కమిటీ సభ్యులు సంపతిరావు జయంత్ కుమార్, చింత. మాధవరావు, కొంచాడ రాజ్ కుమార్, సింగుపురం రాము, లక్ష్మణరావు, శ్రీరాములు, భగవాన్, బాబురావు, గిరి పాల్గొన్నారు.

## గ్రామసభలు విజయవంతం

**పలాస, ఆగస్టు 24(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలో తొలిసారిగా నిర్వహించిన గ్రామ సభలు విజయవంతంగా జరిగాయని పలాస జనసేన పార్టీ సమ న్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన పంచాయతీ రాజ్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం పోయడానికి సమాయత్తమైంద న్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సారథ్యంలో పారదర్శక పాలన అందించే దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిం చారన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలలో ఒకేరోజు గ్రామసభలు నిర్వహిం చాలన్న నిర్ణయం చారిత్రా త్మకమన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 13వేలపై చిలుకు పంచా యతీలకు ఒకేరోజు గ్రామసభలు నిర్వహించడం, నిధులు మంజూరు చేయడం కొత్త అధ్యాయమన్నారు. గ్రామ సభలు నిర్వహించడం ద్వారా సమస్యలు తెలుసు కొని వాటిని పరిష్కరించే వీలుం టుందన్నారు. మన పరిపాలన గ్రామ స్వరాజ్య దిశగా ప్రజలు భాగస్వామ్యం అవు తూ ముందుకు వెళితే ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధిపథంలో ముందుకు వెళుతుందన్నారు. రైతులకు, పేద లకు, బలహీనవర్గాలకు గ్రామీణ ఉపాధి హామీ పథ కం ద్వారా 87 రకాల పనులు కూటమి ప్రభుత్వం అమలుచేస్తుందని చెప్పారు.

## రేషన్ డిపో తనిఖీ

**పలాస, ఆగస్టు 24(వార్త):** రెంటికోట గ్రామంలో శనివారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి, శిశు సంక్షేమ శాఖ పీడి బి శాంతి ప్రియా రేషన్ డిపోను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. డిపోలో నిల్వ ఉన్న సరుకులకు, రికార్డుకు సరిపోయింది లేనిది పరిశీలించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని, ఇటువంటి అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. అనంతరం రెంటి కోట పరిధిలో ఉన్న మూడు అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచక పోవడంతో అంగన్వాడి కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అలా జరగకుండా చూసుకోవాలని అంగన్వాడీ కార్యకర్త లకు హెచ్చరించారు. అంగడి కేంద్రాలను సమయపాలన పాటించాలని, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆమె వెంట పలాస పౌర సర ఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ రవి కుమార్, వీఆర్వో ప్రసాద్ నాయుడు ఉన్నారు.



### కేసుల దర్యాప్తులో..

## నిబంధనలు పాటించండి: ఎస్పీ

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 24 (వార్త):** నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ కేసుల దర్యాప్తునకు సంబంధించిన గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల వంటి కేసుల దర్యాప్తు, ప్రాపర్టీని స్వాధీనం చేయడానికి చట్ట ప్రకారం నిబంధనలు పాటించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులకు నార్కొ డ్రగ్స్, సైబర్ కేసులు దర్యాప్తు, నూతన చట్టాలపై రిటైర్డ్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏసిబి కోర్టు విశాఖపట్నం) కె.రామకృష్ణతో కలిసి ఎస్పీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలను గుర్తించే విధానం, ఎన్డీపిఎస్ కేసులను నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్ట్, మధ్య వర్తనామ, సాక్ష్యాల సేకరణ, సీజ్ చేసిన మత్తుపదార్థాలను నిర్వీర్యం ప్రక్రియ తదితర విషయాలపై పోలీస్ అధికారులకు వివరించారు. ఆయా కేసులపై అధికారులకు ఉన్న పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు పోలీస్ అధికారులు వెంటనే స్పందించి నగదు లావాదేవీలు, నగదు విలువ, ఐడి వివరాలు, ఇతర విషయాలు 1930 కు కాల్ చేయించి రిజిస్ట్రార్ చేసినచో, వారు వెంటనే స్పందించి బ్యాంకు అధికారుల దృష్టికి నేరం వివరాలు తీసుకువెళ్లి, అమాయక ప్రజల నుండి కాజేసిన డబ్బులు సైబర్ నేరగాళ్ల చేతికి పోకుండా అకౌంట్ ఫ్రీజ్ చేయించడం జరుగుతుందని సోషల్ మీడియా సెల్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్, పోలీస్ లీగల్ అడ్వైజర్ యామని రాణి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించండి

**శ్రీకాకుళం, ఆగస్టు 24 (నేడు న్యూస్):** జిల్లాలోని పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని, పరిశ్రమల్లో పని చేసే ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండేలా, వారి ఆరోగ్యానికి హాని లేకుండా ఎలా పని చేయాలో తెలిపేలా యజమానులు తమ కార్మికులకు సరైన సమాచారం, సూచన, శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లాలో అన్ని పరిశ్రమలు దీనిపై రానున్న రెండు వారాల పాటు సంపూర్ణ శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఆయన జిల్లాలోని భారీ, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులతో అత్యవసర సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తో కలసి మాట్లాడారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. అమోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రత ప్రమాణాలు ఉండాలని, ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.




### వక్ఫ్ ఆస్తులను కాజేయడానికే

# చట్ట సవరణలు

* కేంద్ర ప్రభుత్వం మైనార్టీల వ్యతిరేక చర్యకు పూనుకుంది * కేంద్ర ప్రభుత్వ కపటత్వం బయట పడింది * లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

* వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అఖిల పక్ష చర్చావేదికలో వక్తలు

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 24 (వార్త):** వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లిమ్ మైనార్టీలను వక్ఫ్ బోర్డు నుంచి తొలగించేలా ఉందని, ఈ బిల్లును పార్ల మెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం మైనార్టీల వ్యతిరేక చర్యకు పూనుకుం దని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని జామియా మసీదులో శనివారం వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అఖిల పక్ష చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముస్లిమేతరులను వక్ఫ్ కమిటీలలో పెట్టాలని, వారికి కూడా హక్కులు కల్పించాలనటంలో కేంద్ర ప్రభుత్వ కపటత్వం బయట పడిందన్నారు. ముస్లిములపై చిత్తశుద్ధి ఉంటే సచార్ కమిటీ నివేదిక, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసులపై పార్లమెంట్లో పెట్టి చర్చించి అమలు చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ముస్లిములనే లక్ష్యంగా చేసు కొని వారి ఆర్థిక, సాంఘిక, వాణిజ్య, విద్య, బాష, సంస్కృతిపై భౌతిక దాడులకు దిగుతోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తులను, హస్తగతం చేసుకోవడానికి అనేక కుట్ర పూరిత చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ఇప్పటికే వక్ఫ్ ఆస్తులు, భూములను అధికార పార్టీల నాయకులు కబ్జాలకు పాల్పడలేదా అని ప్రశ్నించారు. విభజించు, పాలించు అనే సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం విడనాడా లని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. వక్ఫ్ అనేది ముస్లిం మైనా రిటీల దేవాదాయ భూమి అని ముస్లింలు దైవ సంబంధమైన, సేవాపరమైన పవిత్ర కార్యక్రమాలకి తమ స్వంత భూముల్ని అస్తులను దానం చేస్తారని తెలి పారు. దేశంలో 9 లక్షల 20వేల ఎకరాలు భూమి వక్ఫ్ కింద ఉందని, దీని విలువ సుమారు ఒక లక్ష 20 వేల కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ భూములను కార్పొరేట్లు స్వప్రయోజన పరులు కాజేసేందుకు ఈ చట్ట సవ రణ వాడుకో చూస్తున్నారని తెలిపారు. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరుల్ని నియ మించాలన్న సవరణ చేస్తున్నారని వక్ఫ్ కమిషనర్లను తొలగించి వారి స్థానంలో కలెక్టర్లను అధికారిక సర్వేయర్లుగా చేస్తూ సవరణ తీసుకొచ్చారు. దీని ఉద్దేశం ప్రభుత్వం నేరుగా కలెక్టర్ల ద్వారా వివాదాస్పద వర్ఫ్ భూమిని నిర్ధారించే అధి కారాన్ని పొందుతుందని తెలిపారు. దీంతో వక్స్ భూముల స్వభావాన్ని తమ ఇష్టా రీతిన నిర్ధారించి, వక్స్ పరిధి నుంచి తొలగించే ప్రయత్నం యదేచ్ఛగా బిజెపి ప్రభుత్వం చేయనుందన్నారు కేంద్ర వక్ఫ్ కౌన్సిల్లో ఇప్పుడు అందరూ ముస్లింలే ఉన్నారని, ఆ నిబంధనను తొలగించేశారని పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు బార్ కౌన్సిల్ సభ్యులు పేరుతో ఎంతమంది నైనా ముస్లిమేతరులని నియమించే అధికారం కేంద్ర ప్రభుత్వం చేజిక్కించుకుంటోందని చెప్పారు. వక్ఫ్ ట్రిబ్యునల్స్ లో కూడా ఇంతవరకు ఒక ముస్లిం న్యాయకోవిదుడు ఖచ్చితంగా ఉండాలని నిబంధన ఉందని, ఇప్పుడు దాన్ని తొలగించేశారని ఈ విధంగా ముస్లింల దేవా దాయ వ్యవహారాలపై ముస్లిమేతరుల పెత్తనాన్ని ప్రతిష్ఠించాలని బీజేపీ ప్రయ త్నిస్తోందని తెలిపారు. ఇండియా కూటమి పార్టీలు పార్లమెంటులో తీవ్రంగా ప్రతి ఘటించడంతో బిల్లును జాయింట్ పార్లమెంటరి కమిటీకి పంపినా అది తాత్కా లిక వెనకడుగు మాత్రమేనని గ్రహించాలని చెప్పారు. జామియా మసీదు అధ్య క్షులు మహిబుల్లాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మహిబుల్లాఖాన్, సురంగి మోహనరావు, రౌతు శంకరరావు, వీజీకె మూర్తి, భవిరి కృష్ణమూర్తి, శ్రీని వాసరావు, గంజి ఆర్ ఎజ్రా, కంఠ వేణు, గణేష్, పిసిని చంద్రమోహన్, బాడాన దేవభూషణరావు, భాషా తదితరులు పాల్గొన్నారు.

## సరుకుల కోసం వెళ్లి శవమయ్యాడు



**భామిని, ఆగస్టు 24 (వార్త):** సరు కుల కోసం వెళ్లిన నిరంజన్ సాయంత్రమైనా తిరిగి ఇంటికి చేరక పోవడంతో భార్య శారదతో పాటు బంధువులు పరిసర ప్రాంతాలన్నీ వెతికారు. ఆచూకీ ఎక్కడా లభ్యం కాక పోవడంతో సాయంత్రం పోలీసులకు సమా చారం ఇచ్చారు. వంశధార నదిలో నీరు ఎక్కువగా ప్రవహించడంతో నీటిలో కొట్టుకు పోయాడా అనే అనుమానంతో శనివారం ఉదయం వెదుకగా తాలాడకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కీసరి గ్రామ సమీపంలో మృతదేహం లభ్యమైంది. శనివారం సాయంత్రం పడవ నడపక పోవడంతో నదిలో దిగి వచ్చే ప్రయత్నం చేయడం వల్ల కొట్టుకు పోయాడా లేదా ప్రమాదావశాత్తు కాలు జారీ వంశధార నదిలో గల్లంతైయ్యాడా అన్నది తెలియాల్సివుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జగన్ జైలుకెళ్లడం పక్కా

* గత వైసీపీ అక్రమాలపై నిలదీశా * ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ * సెప్టెంబరు 1 నుంచి సభ్యత్వ నమోదు * విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు




**శ్రీకాకుళం, ఆగస్టు 24 (వార్త):** గతంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను మొదటిగా ప్రశ్నించిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది నేనే.. జగన్ జైలుకు వెళ్లడం పక్కా అని విశాఖ నార్త్ ఎమ్మెల్యే, బీజేపీ నేత పెనుమత్స విష్ణు కుమార్ రాజు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదుపై జిల్లా కార్యశాల సమావేశం శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్లో పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. దేశ హితం కోసం ప్రపంచ శాంతి కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో నిరంతరం బీజేపీ నాయకులు పనిచేస్తున్నారన్నారు. సెప్టెంబర్ 1 నుంచి దేశ వ్యాప్తంగా నూతనంగా సభ్యత్వ నమోదు చేసుకునే ప్రక్రియ ప్రారంభం కానుందని చెప్పారు. అందులో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మండల, బూత్ స్థాయిల్లో నూతన సభ్యత్వాలు నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు.సభ్యత్వ నమోదు ఎలా చేసుకోవాలి, ఏ మాధ్యమాలు ద్వారా ప్రచారం కల్పించాలి, క్రియాశీలక సభ్యత్వం ఎవరికి ఇవ్వడం జరుగుతుంది, తదితర అంశాపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా ఇన్చార్జి విజయానంద రెడ్డి వివరించారు. బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు సెప్టెంబర్ 1న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాని నరేంద్ర మోడీ, సెప్టెంబర్ 2వ తేదీన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభిస్తారన్నారు. సెప్టెంబర్ 3,4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. దీనికి సంబంధించి జాతీయ పార్టీ నెంబర్ ను ఇవ్వడం జరిగిందన్నారు. 8800002024 ఈ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా లింక్ వస్తుందని, ఆ లింక్ క్లిక్ చేయడం ద్వారా మన వివరాలు నింపితే సభ్యత్వ కార్డు నమోదు అవుతుందని చెప్పారు. ఈ నెంబర్ సెప్టెంబర్ 1 తరువాత పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, సభ్యత్వ నమోదు జిల్లా కమిటీ సభ్యులు పాలవలస వైకుంఠరావు, చల్లా వేంకటేశ్వరరావు, బూరె నరేంద్ర చక్రవర్తులు, ప్రధాన కార్యదర్శులు సలాన రాఘవరావు, సి డి ఆర్ గాంధీ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, సాదూ కిరణ్ కుమార్, గంగు శ్రీదేవి, కార్యదర్శులు సింగారపు కృష్ణారావు, ఉషారాణి, సీనియర్ నాయకులు పైడి రాజారావు, మోర్చా అధ్యక్షులు జన్ని పర మేష్, సీపాన కృష్ణమూర్తి, కిసాన్ మోర్చా నడుపూర్ లక్ష్మీనారాయణ, కిల్లి లక్ష్మణ్, రామారావు కరుకోల, మండల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, మోర్చా అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా పదాధికారులు, సెల్స్ డిపార్ట్ మెంట్ కన్వీనర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పలాస అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలువురు బీజేపీలో చేరారు.



### పేషెంట్లపై ఆర్థిక భారం..

# వేస్తే కఠిన చర్యలు

* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో సమావేశం

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు24 (వార్త):** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద వైద్యం తీసుకొనే పేషెంట్లపై ఆర్థిక భారం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి పేషెంట్ల నుండి ఏ విధమైన నగదు వసూలు చేయకుండా వైద్యం చేయడంపై కార్పొరేట్ ఆసుపత్రులతో శనివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్లపై ఆర్థిక భారం వేయకుండా నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించాలన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఆసుపత్రుల్లో చేరే పేషెంట్లకు నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించే బాధ్యత ఆరోగ్య మిత్ర బాధ్యత వహించాలన్నారు. పేషెంట్స్ ఎవరైనా ఫిర్యాదు చేస్తే అదే రోజున విచారించాలన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశరావు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో పేషెంట్లకు వైద్య పరీక్షలు చేసే చార్జీలు డిస్‌ప్లే చేయాలన్నారు. సెకండరీ పరీక్షలకు పేషెంట్ల నుండి నగదు వసూలు చేయరాదని చెప్పారు. ఫైర్, బయోమెడికల్ వేస్టేజ్ మేనేజ్ మెంట్ లపై కలెక్టర్ ఆరా తీయగా రెయిన్‌బోకి ఇస్తున్నట్లు ప్రకాశరావు తెలిపారు. పేషెంట్లు ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం వస్తే అక్కడ ఆ వైద్యం లేకపోతే ఎక్కడైతే ట్రీట్ మెంట్ ఇస్తారో ఆ ఆసుపత్రుల పేర్లు ఖచ్చితంగా తెలపాలన్నారు. భోజనం మెనూలో పాలు, పళ్లు ఉన్నట్లు చూడాలని చెప్పారు. 108 సర్వీసులను పక్కాగా వినియోగించాలని వివరించారు. వివిధ ఆసుపత్రులపై ఫిర్యాదులు గూర్చి ఆయన అడుగగా ఫిర్యాదులపై కో ఆర్డినేటర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఓ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీకాంత్, కార్పొరేట్ ఆసుపత్రులకు సంబంధించి ప్రతినిధులు జెమ్స్ నుండి జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కిమ్స్ నుండి సోమేశ్వరరావు, మెడికవర్ నుండి మేనేజర్ శివ కుమార్, తదితర ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**నరసన్నపేట, ఆగస్టు 24 (వార్త):** ఉుకలాం ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. స్థానిక గొట్టిపల్లి జంక్షన్ వద్ద రెవిన్యూ అధికారులు ఇసుక ట్రాక్టర్ను గుర్తించారు. ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ సత్యనారాయణ హెచ్చరించారు. రెవెన్యూ అధికారులతో ఇసుక అక్రమ రవాణాపై సమావేశం నిర్వహించారు.

## సారవకోట పీఎస్ ఎస్పీ తనిఖీ

**సారవకోట, ఆగస్టు 24 (వార్త):** సారవకోట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాతపట్నం చెక్పోస్ట్ ను పరిశీలించేందుకు వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో రాత్రి 8 గంటల సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆగి లోపలకు వెళ్లారు. ఆ సమయంలో ఏఎస్ఐ లక్ష్మీనారాయణ విధుల్లో ఉన్నారు. కేసుల పరిష్కారంలో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



## హెడ్ రెగ్యులేటర్ నుంచి ఇసుక తొలిగింపు

**భామిని, ఆగస్టు 24 (వార్త):** మండలంలోని నేరడి బ్యారేజీ కుడి కాలువ ఓపెన్ హెడ్ రెగ్యులేటర్ని పార్వతీపురం జాయింట్ కలెక్టర్ శోభిక శనివారం పరిశీలించారు. ఓపెన్ హెడ్ రెగ్యులేటర్లో పేరుకుపోయిన ఇసుకను తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ పనులు చేపట్టాలని సూచించారు. ఓపెన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి తొలగించిన ఇసుకను నేరడి వద్ద డంపింగ్ చేయాలనీ రెవెన్యూ అధికారులును సూచించారు.

## పురపాలక నూతన కమిషనర్గా బాలాజీ ప్రసాద్



**ఆమదాలవలస, ఆగస్టు 24 (వార్త):** ఆమదాలవలస పురపాలక సంస్థ నూతన కమిషనర్గా బెలమం పంచాయతీ లొద్దలపేట గ్రామానికి చెందిన పూజరి బాలాజీ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇటీవల బదిలీలలో భాగం గా నెల్లిమర్ల నగరపాలకసంస్థ నుంచి ఆమదాలవలసి బదిలీ అయ్యారు. బాలాజీ ప్రసాద్ గతంలో ఆమదాలవలసలో పనిచేసిన అనుభవం ఉంది. ఈయన నియామకం పట్ల లొద్దలపేట గ్రామస్తులు, పురపాలక ఉద్యోగులు పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐగా శ్రీనివాస్



**ఇచ్ఛాపురం, ఆగస్టు 24(వార్త):** ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐగా ఈమంది శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం అర్ ఏ వలస నుండి బదిలీ పై వచ్చారు. ఈయన గతంలో ట్రైనీ ఎస్ఐగా పనిచేసారు. ఇక్కడ పని చేసిన ఎస్ ఐ లక్ష్మణ్ ను విశాఖ జిల్లా విఆర్కు బదిలీ అయింది. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ యాదవ్, 17 వ వార్డ్ తెలుగుదేశం ఇంఛార్జి జన్నెల సంతోష్ యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## న్యాయ సూత్రాలపై అవగాహన ఉండాలి

**బూర్జ, ఆగస్టు 24 (వార్త):** ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే న్యాయ సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమదాలవలస సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. శనివారం ఓవీపేట ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సందస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరు సోదరభావంతో మెలగాలని, విద్యార్థి దశలోనే క్రమశిక్షణతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 14.19.20.21ఏ తదిత సెక్షన్ల గురించి వివరించారు. సదస్సులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు శీపాన గోవిందరావు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది తమ్మినేని అన్నం నాయుడు, డోల రమణమూర్తి, బూర్జ ఎస్ఐ ప్రవల్లిక, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ చింతాడ కృష్ణారావు కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు బి.రాజశేఖర్ పాల్గొన్నారు.




# భలా.. అచ్చెన్నా..!



* నియోజకవర్గంలో మంత్రి సుడిగాలి పర్యటన * ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుంటున్న అచ్చెన్న * ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని భరోసా

**సంతబొమ్మాళి, ఆగస్టు 24 (వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్టైలే వేరు. ఏది చేసినా అందులో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఒకవైపు అధికారులు, మరోవైపు కార్యకర్తలు, ఇంకోవైపు ప్రజలతో మమేకమవుతూ నిత్యం బిజీగా ఉంటున్నారు. ఎప్పుడు అమరావతిలో ఉంటున్నారో, ఎప్పుడు టెక్కలి నియోజకవర్గంలో ఉంటున్నారో అంతే చిక్కడం లేదు. అక్కడ నేనే.. ఇక్కడ నేనే అన్నట్టుగా ప్రజలు, అధికారులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకుసాగుతున్నారు. నాయకుడంటే.. ఇలా ఉండాలి అన్నట్టుగా ప్రజల నుంచి మన్ననలు పొందుతున్నారు. శుక్రవారం టెక్కలి మండలంలో, శనివారం సంతబొమ్మాళి మండలంలో బుల్లెట్పై విస్తృతంగా పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు అప్పటికప్పుడు కృషి చేశారు. అలాగే మరికొందరి నుంచి వినతులు స్వీకరించారు. ఇక నిమ్మాడ క్యాంపు ఆఫీసులో తనను కలిసేందుకు వచ్చిన ప్రజలను, అధికారులను కలిశారు. ప్రజలు అందించిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.









Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413